# మేకార్తి దినపత్రిక

PRGI NO: TGTEL/25/A2356



జర్నలిస్టులకు ఆహ్వానం

నూతనంగా ప్రారంభించిన మేకార్తి దినపత్రిక పత్రికలో

అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు

జర్నలిస్టులు కావలెను

సంప్రదించాల్సిన నెంబర్స్

9014726022,6302041083



మంగళవారం 12-05-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 250 | WWW.MEKARTHI DINAPATRIKA.COM


## ఖజానా ఖాళీ ఆరోపణల వేళ..

## స్టాలిన్ ఇంటికి సీఎం విజయ్



చెన్నై: తమిళనాడు కొత్త సీఎం విజయ్ - మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తో భేటీ అయ్యారు. టీవీకే చీఫ్ సోమవారం డీఎంకే అధినేత నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. స్టాలిన్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు.

2లో..

## భార్యను పశువులా చూడొద్దు:

## గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

గృహహింస కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యను భర్త పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే హక్కు ఉందని స్పష్టం చేసింది . గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. అనంతరం అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. గతంలో పట్నా హైకోర్టు కూడా ఆ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

2లో..



# అందుకే.. విద్యాశాఖను నేనే పర్యవేక్షిస్తున్నా

### – సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: విద్యా ద్వారా సమాజంలో మార్పు తీసుకురాగలమని, ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను ఆయన

> "విద్యావ్యవస్థలో తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. 1969 తెలంగాణ ఉద్యమానికి అదే కారణం. పేద, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య అందించడం మా ప్రభుత్వ బాధ్యత."

> "మేం అధికారంలోకి రాగానే 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లో పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. 36 వేల మంది టీచర్ల బదిలీలను వివాదాలకు తావులేకుండా పూర్తి చేశాం."

- »విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంపు
- »ఫిన్‌లాండ్‌కు 25 మంది టీచర్ల పంపిణీ
- »ప్రభుత్వ పాఠశాలల్లో పోషకాహారం, బ్రేక్‌ఫాస్ట్ పథకం

2లో

### ముఖ్యాంశాలు

- »ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు ప్రారంభం
- »రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- »11 వేల టీచర్ పోస్టుల భర్తీ
- »36 వేల మంది టీచర్ల బదిలీలు వివాదాలకు తావులేకుండా నిర్వహణ
- »ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం
- »విదేశాల్లో ఉత్తమ విద్యా విధానాల అధ్యయనం

### రామాయపట్నం పోర్టుకు రైలు మార్గాన్ని కలపండి:

## కేంద్రమంత్రికి ఎంపీ లావు విజ్ఞప్తి



2లో..

## ఆయుష్ వైద్య సేవలు.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం!




2లో..

## కొనసాగుతున్న అల్పపీడనం.. వారం రోజుల్లో ఏపీలో వర్షాలు

**నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని శ్రీలంక పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది.**



విశాఖ: నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని శ్రీలంక పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 48 గంటల్లో ఈ అల్పపీడనం మరింత బలపడే అవకాశాలున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. అల్పపీడనానికి అనుబంధంగా 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని చెప్పారు. ఫలితంగా వారం రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం కోస్తా జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయని తెలిపారు. గడిచిన 24 గంటల్లో అల్లూరి జిల్లా పాడేరులో అత్యధికంగా 3.24 సెం.మీ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

## అలా చెప్పడం ప్రధాని హోదాకు తగదు: మంత్రి పొన్నం

హైదరాబాద్: ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని,



మిగతాది 2లో

## ప్రధాని మా ఇంటికి రావడం గొప్ప విశేషం

2లో..



మరచిపోలేని అనుభూతిని పొందాం

ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్



## మోర్తాడ్‌లో రైతుల రహదారి ధర్నా

**ధాన్యం కొనుగోళ్లు,తరుగుదోపిడీపై నిరసనలు అధికారులు స్పందించడం లేదన్న మాజీమంత్రి వేముల**

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని, తరుగు దోపిడీని అరికట్టాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు,

2లో..

# జై బోలో హనుమాన్ కి ...జై...

హిందూ ఏక్తా యాత్ర కోసం కదలిరండి.. విజయవంతం చేయండి..
బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర



హనుమాన్ జయంతి ( మే 12 ) సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ ఏక్తాయాత్ర కోసం హిందూ బంధువులందరూ కదిలి రావాలని, యాత్రను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర కోరారు. సోమవారం రోజున కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్లో ప్రతి ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో హిందూ ఏక్తా యాత్ర నిర్వహించడం ఒక ఆనవాయితీగా వస్తుందన్నారు. హిందువుల సంఘటిత శక్తిని చాటేందుకు , లక్షలాదిమందితో జరిగే ఈ యాత్రకు తెలంగాణ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు వచ్చిందని తెలిపారు. కరీంనగర్లో జరిగే భారీ ఆధ్యాత్మిక కార్యక్రమంగా హిందూ ఎక్తాయాత్ర కు ఖ్యాతి గుర్తింపు లభించిందన్నారు. గత 12 ఏళ్లుగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం కరీంనగర్ నగరాన్ని కాషాయమంగా మార్చుతూ , ప్రతి ఏటా ఎంతో ఘనంగా , వైభవంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్నారని తెలిపారు. వైశ్య భవన్ నుండి ప్రారంభమై కరీంనగర్లోని ప్రధాన కూడళ్ల మీదుగా కొనసాగే ఈ యాత్ర అశేష హిందూ బంధువుల, వివిధ హిందూ సంఘాల భాగస్వామ్యంతో విజయవంతంగా కొనసాగుతుందన్నారు.


# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి..

- హమాలీల కోరత లేకుండా చర్యలు తీసుకోవాలి..
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మంత్రి అడ్లూరి..



ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా బుగ్గారం, గోపులాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా కాంటాలు పూర్తయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, హమాలీల సమస్య ఉంటే అదనంగా డబ్బులు చెల్లించి కొనుగోలు పూర్తి అయ్యేవిధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు నిత్యం ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి కొనుగోలు వేగవంతం అయ్యే విధంగా చూడాలని మంత్రి సూచించారు.బుగ్గారం మండల కేంద్రంలో అదనపు ధాన్యం కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా అందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గోపులాపూర్ గ్రామంలో రైతులు యూరియా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడిన మంత్రి ఖరీఫ్ సీజన్ కల్లా గోపులాపూర్ రైతులకు యూరియా పాయింట్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బుగ్గారం తాజా మాజీ జెడ్పిటిసి భాదినేని రాజేందర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల సుభాష్ నరసయ్య కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు

# రెడ్డి సేవా సమితి భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



పెబ్బేరు మండలం జనుంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డి సేవా సమితి భవన నిర్మాణానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కమ్యూనిటీ పరమైన అభివృద్ధి జరగడం శుభసూచకమని గ్రామాలోని అన్ని సంఘాలు బలోపేతం అయిన రోజున గ్రామం బలపడుతుందని ప్రతి ఒక్క సంఘం బలపడాలని ఎమ్మెల్యే అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామాలలోని ప్రతి సంఘం అభివృద్ధి చెందాలని అందుకు; తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యేపేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రెడ్డి సేవా సమితి సభ్యులు నా మనసును తదితరులు పాల్గొన్నారు

# పారిశ్రామిక ప్రగతిలో సిఐఐది కీలక భూమిక

మొదటిపేజీ తరువాయి
ఇన్నోవేటర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలున్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు ప్రోత్సహిస్తారన్న నమ్మకం ఉందన్నారు. 1990 సంస్కరణల మాదిరిగా భారత్ మరో మైలురాయి ముంగిట ఉంది. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోంది. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు తదుపరి గ్లోబల్ ఎకనమిక్ ఆర్డర్‌ను నిర్ధరిస్తాయి. ఆర్థిక సంస్కరణల వల్ల మనందరికీ సృజనాత్మకతతో వైవిధ్యంగా ఆలోచించే అవకాశం వచ్చింది. ఆర్థిక సంస్కరణలకు ముందు, తర్వాత ఎందరో ప్రధానులను చూశా. సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ నేతృత్వం ఉండటం మన అదృష్టం. దేశంలో స్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. భారత్ అన్‌స్టాపబుల్‌గా సాగుతోంది. గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని చంద్రబాబు తెలిపారు.

# మోర్తాడ్‌లో రైతుల రహదారి ధర్నా

మొదటిపేజీ తరువాయి
మంత్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దొడ్డు రకం ధాన్యానికి గ్రేడ్ వన్ ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కల్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరన్న తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతున్నదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పంటను అమ్ముకోవడానికి రైతులు నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. మూడు రోజులుగా పలు కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించానని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడానికి రైతు నిరసన, ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేస్తామని ప్రకటించి కేంద్రాలు తెరిచే సరికి 15 రోజులు, గన్నీ బ్యాగులు వచ్చేసరికి వారం, కాంటా పెట్టేసరికి మరో వారం అన్నట్లుగా 20 రోజుల పాటు కావాలనే జాప్యం చేసిందని ఆరోపించారు. మద్దతు ధర రూ. 2,390 ఉండగా ప్రభుత్వ జాప్యం భరించలేక రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యక్తులకు రూ. 1,750 నుంచి రూ. 1900లకే అమ్ముకుంటున్నారని, దీంతో ఎకరాకు సుమారు రూ. 15వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లర్లు ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని, తరుగు పేరుతో 40 కిలోలకు 5 కిలోల అదనపు వడ్లు (క్వింటాలుకు 12.5 కిలోలు) దోచుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇది కేవలం 1.5 కిలోలు మాత్రమే ఉండేదని గుర్తు చేశారు. ల్గ÷తుల సమస్యలపై మాట్లాడేందుకు కలెక్టర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడంలేదని, కనీసం స్పందించే తీరిక కూడా లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ పాలసీలో భాగమేనని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, రవాణాకు లారీలను పెంచాలని, గన్నీ బ్యాగుల కొరత తీర్చాలని, తరుగును తగ్గించి, పాత పద్ధతిలోనే వడ్లు సేకరించాలని, దొడ్డు రకానికి గ్రేడ్ -1 రేటుతో పాటు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి రైతులకు న్యాయం చేసే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు.నియోజకవర్గంలోని రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రధాని మా ఇంటికి రావడం గొప్ప విశేషం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తమ నివాసానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేస్తూ ప్రధాని పర్యటనను ప్రత్యేకమైన సందర్భంగా వారు అభివర్ణించారు. ప్రధాని మోదీకి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తమ కుటుంబం ఎప్పటికీ మర్చిపోలేని, ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే సాయంత్రం ఇదని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ రోజు తమ నివాసంలో ప్రధాని మోదీకి ఆతిథ్యం ఇవ్వడం తమకు లభించిన గొప్ప గౌరవం, సంతోషమని చెప్పుకొచ్చారు. ఆప్యాయత, అనురాగంతో ప్రధాని తమతో గడిపిన ఈ సందర్భం తమ అందరికీ ఎంతో ప్రత్యేకమని వ్యాఖ్యానించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో మోదీ అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి, మద్దతుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు చెప్పారు. హైదరాబాద్‌లోని తమ ఇంటికి ప్రధాని మోదీని స్వాగతించడం గొప్ప విశేషమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. మోదీ తమ కుటుంబానికి అందించిన ఆప్యాయత, ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబంలోని మూడు తరాలు ప్రధానితో కలిసి ఉండటం ముఖ్యంగా గుర్తుండి పోయే మధుర జ్ఞాపకమని చెప్పుకొచ్చారు. మోదీ.. తన కుమారుడు నారా దేవన్ష్‌ను ఆశీర్వదించడం నిజంగా గొప్ప అదృష్టమని తెలిపారు. ఎప్పటిలాగే, తాను దేశంపై ఆయన అచంచలమైన నిబద్ధతతో ప్రేరణ పొందానని అన్నారు. ప్రజల సేవలో మరింత కష్టపడి తాను పనిచేయడానికి మోదీ నుంచి స్ఫూర్తి పొందానని తెలిపారు. ఇలాంటి క్షణాలు జీవితాంతం ఎంతో గుర్తుండి పోతాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# అలా చెప్పడం ప్రధాని హోదాకు తగదు: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి
కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్‌ఆర్‌ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి

# ఖజానా ఖాళీ ఆరోపణల వేళ..

మొదటిపేజీ తరువాయి
ఈ నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఖజానాను గత డీఎంకే ప్రభుత్వం ఖాళీ చేసిందని ఇప్పటికే విజయ్ (ఎఅయిఎ) ఆరోపించారు. దీనికి స్టాలిన్ కూడా బదులిచ్చారు. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయన్నారు. కొవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొని, నిధులు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించిన భాజపాను తట్టుకుని దీటుగా నిలబడ్డామని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.
చీలిక దిశగా అన్నాడీఎంకే?
సర్టిఫికేట్ మర్చిపోయి.. ప్రమాణస్వీకారం మిస్ అయిన మంత్రి కీర్తన..
టీవీకే విజయ్ నేతృత్వంలో ఆదివారం తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మే 13న ఈ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కోనుంది. మరోవైపు నేడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. నిన్న మంత్రిగా ప్రమాణం చేసిన యువనేత కీర్తన.. నేడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఎలక్షన్ సర్టిఫికేట్‌ను తీసుకురాకపోవడమే అందుకు కారణం. తర్వాత వెనక్కి వెళ్లిన ఆమె దానిని తీసుకొచ్చి, సమర్పించడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు.

## భార్యను పశువులా చూడొద్దు: గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
నిందితుడు మద్యం మత్తులో దాడి చేశాడని బాధితురాలి తరఫు న్యాయవాది కోర్టు (ాబజూతీవఎవ జశీబతీ)లో వాదనలు వినిపించారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు గాయమైంది. ఆ తర్వాత కర్రతో కూడా దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. మరోవైపు నిందితుడు మూడు వివాహాలు చేసుకోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలు మొదటి భార్య. వాదనలు విన్న న్యాయస్థానం.. "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు..? ఇలాగే వేధిస్తే.. ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అంటూ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

## రామాయపట్నం పోర్టుకు రైలు మార్గాన్ని కలపండి: కేంద్రమంత్రికి ఎంపీ లావు విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి
దిల్లీ: పిడుగురాళ్ల జంక్షన్‌ను రామాయపట్నం పోర్టుకు లింక్ చేస్తూ.. కొత్త రైల్వే లైన్ తీసుకురావాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం కేంద్రమంత్రిని ఆయన కలిసి ఈ విజ్ఞప్తి చేశారు. ఓడరేవుకు రైలు మార్గాన్ని కలపడం ద్వారా.. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన పెరుగుతుందని వివరించారు. సిమెంట్, సున్నపురాయి, వ్యవసాయం, లాజిస్టిక్స్ రంగాలకు గణనీయంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. సికింద్రాబాద్- తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో స్టాపులు ఇవ్వాలని కోరారు. పల్నాడు నుంచి వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోజువారీ ప్రయాణికులు ప్రస్తుతం ప్రధాన నగరాలకు వేగవంతమైన రైలు కనెక్టివిటీని పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు మధ్య విద్యార్థులు, ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు, కుటుంబాల రాకపోకలు పెరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని.. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని కేంద్రమంత్రిని ఎంపీ కోరారు. ప్రతిపాదిత ఈ సర్వీసు ప్రయాణ సమయాన్ని తగ్గించి, రెండు ప్రాంతాల మధ్య హై-స్పీడ్ రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తుందన్నారు. తన ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. అభ్యర్థనలను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# ఆయుష్ వైద్య సేవలు.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం!

మొదటిపేజీ తరువాయి
అమరావతి: ఆయుష్ వైద్య సేవల్లో నాణ్యత మరింత పెంచేందుకు, గుర్తింపు లేని వైద్యులకు కళ్లెం వేసేందుకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ ఆయుర్వేద, హోమియో, సిద్ధ, యూనాని, నేచురోపతి వైద్యానికి ప్రాచుర్యం తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2022కు సవరణ చేసే బిల్లుకు రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలిపారు. త్వరలో కొత్త విధివిధానాలు రాబోతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విధివిధానాల రూపకల్పన కోసం మూడు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. టెక్నికల్, ఎక్స్‌పర్ట్స్, స్టేక్ హోల్డర్స్ కమిటీలు వేశారు. ఒక్కో కమిటీలో ముగ్గురు అధికారులు, సీనియర్ వైద్యులు, నిపుణులు ఉంటారు. ఈ కమిటీలు ఆయుష్ వైద్య రంగ నిపుణులు, ప్రజల్ని భాగస్వామ్యం చేసి వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని ఈ నెలాఖరులోగా నివేదిక సమర్పించనున్నాయి. విధివిధానాల రూపకల్పన కోసం కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ అంశాలను కమిటీలు పరిశీలిస్తాయని ఆయుష్ విభాగం ఇన్‌ఛార్జి డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. కొత్తగా వచ్చే నిబంధనల ప్రకారం క్లినిక్‌లు, ఆసుపత్రులు ఆయుష్ శాఖ నుంచి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందాల్సి ఉంటుంది. విద్యార్హతలు కలిగిన వారి ద్వారా మాత్రమే ఆయుష్ వైద్య సేవలు ప్రజలకు అందుతాయి.

# ఆర్మూర్ సొసైటీకి తాళం

ధాన్యంతరలించక పోవడంపై రైతుల నిరసన

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సొసైటీ పరిధిలోని రాంపూర్ గ్రామంలో నెలరోజులుగా ధాన్యం కోసి కల్లాల్లో వేసి తూకం చేసిన కూడా లారీల కొరతతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాంపూర్ గ్రామస్తులు ఆర్మూర్ సొసైటీకి సోమవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సొసైటీ నిర్వాహకులు లారీ యజమానులతో కుమ్మక్కై లారీలను తమ గ్రామానికి పంపడం
లేదని, మిగతా గ్రామాలకు ప్రతీరోజు ఒకటి, రెండు లారీలను పంపుతూ ధాన్యం సేకరిస్తున్నారని, తమ గ్రామం పై వివక్ష ఎందుకు చూపిస్తున్నారని సొసైటీ చైర్మన్ ని నిలదీశారు. ధాన్యం రోజుల తరబడి కల్లాల్లో ఉండడం వల్ల తరుగు రూపంలో క్వింటానికి 10 కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలను పంపి కొరతను తీరుస్తానని నిర్వాహకులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి రెండు రోజులలో లారీలను తీసుకొని రాకుంటే ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గ్రామస్తులము అందరం కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజావాణికి 165 దరఖాస్తుల రాక

మేకార్తి దినపత్రిక, మే 11 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



ప్రజావాణి అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 165 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేయండి

అంబేద్కర్ సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు బండ రమేష్

మేకార్తి దినపత్రిక మే 11 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా లోని కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీలు వేయడం జరిగింది ఆ కమిటీ వాళ్లు వాళ్ల పార్టీ కార్యకర్తలకి ఇందిరామ్మ ఇండ్లను పేర్లు వాళ్లకు సంబంధించిన వాళ్లకే ఇవ్వడానికి తీర్మానం చేయడం జరుగుతుంది దాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు బండ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో మండలంలోదళితకుటుంబాలకు చెందిన నిరుపేద వాళ్లకు ఇవ్వకుండా వాళ్లకు అనుకూలంగా ఉన్నవాళ్లకు ఇస్తున్నారని అదేవిధంగా ఇప్పుడు నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ పాలకవర్గం అప్పజెప్పాలని వాళ్లు గ్రామపంచాయతీ బాడీ మీటింగ్ పెట్టి నిరుపేదలను గుర్తించి ఇండ్లు ఇవ్వడానికి తీర్మానం చేస్తారని అదేవిధంగా వెంటనే మండలాల్లో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు రద్దుచేసి గ్రామపంచాయతీ పాలకవర్గానికి అప్పజెప్పాలని బండ రమేష్ డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారి చుట్టాలకు వారి దోస్తులకు తప్ప సరైన నిరుపేదలకు ఇవ్వడం లేదని బండ రమేష్ డిమాండ్ చేశారు పాలకవర్గం ఉండంగా కూడా వాళ్లే తీర్మానం చేసి పంపుతూ ఎండిఓ ఎమ్మార్వో వాళ్లకు పంపుతూ వాళ్లు దాన్ని ఫైనల్ చేస్తూ ఉన్నవారా లేనివారా అని చూడకుండా ఫైనల్జే చేయడం జరుగుతుంది దీనివల్ల నిరుపేదలకు దళిత బిడ్డలకు ఇందిరమ్మ రాజ్యంలో అన్యాయం జరుగుతుందని బండ రమేష్ డిమాండ్ చేశారు

# పెంబర్తిలో దుర్గమ్మ పండగ వేడుకల్లో పాల్గొన్న కొమ్మూరి ప్రతాప్ రెడ్డి.

మేకార్తి దినపత్రిక మే 10
సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



పెంబర్తి గ్రామంలో నిర్వహించిన దుర్గమ్మ పండగ (జాతర) సందర్భంగా జనగామ నియోజకవర్గం ఇంచార్జీ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దుర్గమాత అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.వారి వెంట జనగామ హైదరాబాద్ గ్రంధాలయ చైర్మన్ ఉపేందర్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఇ్రాజూ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి,జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొలుసుల దుర్గేష్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి,వార్డు కౌన్సిలర్ లు లోకమంత్ రెడ్డి,నాని, ప్రసాద్, ూవీజ డైరెక్టర్లు కొండల్ రెడ్డి,నామాల శ్రీనివాస్,సీనియర్ నాయకులు పజ్జూరి జయహరి,బడికే కృష్ణ స్వామి,సాదం మధుసూదన్ యాదవ్, సంకటి యాదగిరి, సుదగని కృష్ణా, ప్రభాకర్ యాదవ్,శ్రీను,రమేష్,యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్,రాజు,రమేష్,రాజేష్, చింటూ,మరియు మండల నాయకులు , గ్రామ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" లో భాగంగా విద్యా వారోత్సవాలు విజయవంతం చేయాలి:

- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు
- సిరిసిల్ల పట్టణం గీతానగర్ పీఎంశ్రీ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం
- విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

మేకార్తి దినపత్రిక,మే -11 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఒత్తిడి కలగకుండా, వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నేటి నుండి ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణం గీతానగర్ లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సమ్మర్ క్యాంపు ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు క్షేత్ర స్థాయిలో వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలు నిర్వహించడానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈరోజు జిల్లాలోని 9 పీఎంశ్రీ పాఠశాలతో పాటు, కేజీబీవీ రుద్రంగి లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రోజువారీగా ఈరోజు నుండి 17 వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈరోజు మౌలిక వసతుల పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, సమ్మర్ క్యాంపుల ప్రారంభం, రెండవ రోజు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు రెమిడియల్ తరగతుల ప్రారంభం, ఇంటర్మీడియట్ విద్యార్థుల రెమిడియల్ తరగతుల ముగింపు, మూడవ రోజు పాఠశాల విద్యా కార్యక్రమాలపై సర్పంచ్‌లతో నియోజకవర్గ స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహణ, నాలుగవ రోజు ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహణ, ఐదవ రోజు పుస్తక పఠనం ప్రాముఖ్యతపై జిల్లా, మండల గ్రంథాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, రవ రోజు ఆర్ట్, క్రాఫ్ట్ ఉ కల్చరల్ డే నిర్వహణ, ఏడవ రోజు విద్యా విజయోత్సవ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో భాగంగా నాట్యం, సంగీతం, చేతి రాత, చిత్రలేఖనం, కర్రసాము ఆటలు నేర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతీ రోజు విద్యార్థులకు ఉదయం 8 నుండి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఏ పాఠశాల విద్యార్థులైనా ఇందులో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యా వారోత్సవాల ముగింపు రోజు విద్యా విజయోత్సవ దినోత్సవం సందర్భంగా జిల్లాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి అత్యుత్తమైన మార్కులను పొందిన విద్యార్థులకు సన్మానం చేసి, నగదు బహుమతి ప్రోత్సాహకంగా ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. సిరిసిల్ల గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు, సదుపాయాలు ఉన్నాయని, ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించే స్థాయిలో డిమాండ్ ఉందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపేందుకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలతో ముందుకు రావడానికి చురుకుగా ఉన్న విద్యార్థులను ఇస్రో కు పంపిస్తామని, ఇప్పటికే చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. జీవితంలో విద్యార్థులు చదువుతో పాటు అన్నీ విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని, అందుకే ఈ సమ్మర్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు నైపుణ్యాలను వెలికితీసేలా ఏదైనా ఒక హాబీ ఉండాలని, లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానికి అనుగుణంగా కష్టపడి, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాల్లో 589 మార్కులు సాధించి, అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అంకాలపు సిరికి సన్మానం చేసి అభినందించారు. అనంతరం సమ్మర్ క్యాంపు విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, మండల విద్యాధికారి రఘుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, తదితరులు పాల్గొన్నారు.

# ఇది మీ ప్రభుత్వం.. డ్రగ్స్‌పై ఈ రోజు నుంచే పోరాటం: సీఎం విజయ్

మేకార్తి దినపత్రిక మే 10
సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత విజయ్ తొలిసారిగా సభను ఉద్దేశించి ప్రసంగించారు.తన జీవితంలో చాలా కష్టాలు అనుభవించానన్న సీఎం విజయ్.. ఆకలి బాధలు అంటే ఏంటో తనకు తెలుసన్నారు. తనను అభిమానంగా పిలిచారు కాబట్టే రాజకీయాల్లోకి వచ్చానని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు.
'నేను మీ కుటుంబ సభ్యుడి లాంటి వాడిని సినిమాల్లో నన్ను ఉన్నతస్థాయిలో నిలిపారు.తమ్ముడూ రా.. అంటూ పిలిచారు కాబట్టే రాజకీయాల్లోకి వచ్చాను.నా ప్రయాణంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా.




ఇది మీ ప్రభుత్వం.. డ్రగ్స్‌పై ఈ రోజు నుంచే పోరాటం ప్రారంభం'అని సీఎం విజయ్ అన్నారు.ప్రస్తుతం.. తమిళనాడు ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని విజయ్ తన ప్రసంగంలో వెల్లడించారు.గత ప్రభుత్వం ఖజానా మొత్తం ఖాళీ చేసిందని.. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని తెలిపారు.ఏది సాధ్యమో అది మాత్రమే చేస్తామని.. అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని ముఖ్యమంత్రి వివరించారు.'దిస్ ఈజ్ న్యూ బిగినింగ్ ప్రజా ధనాన్ని వృథా చేయను.. దోచుకోను. టీవీకేలో ఒకే ఒక అధికార కేంద్రం ఉంది.. అది విజయ్ మాత్రమే.నేను పవర్ సెంటర్.. మరో పవర్ సెంటర్ ఉండదు.. ఉండబోదు. మైనారిటీ ప్రజలకు,విద్యార్థుల భవిష్యత్తుకు అండగా ఉంటా కార్యకర్తల వల్లే ఈ విజయం సాధ్యమైంది.వారికి రుణపడి ఉంటా ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.మిత్రువులైనా, శత్రువులైనా.. అందరికీ ఒకే చట్టం'అని ముఖ్యమంత్రి విజయ్ పేర్కొన్నారు.

# "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" లో భాగంగా విద్యా వారోత్సవాలు విజయవంతం చేయాలి:

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

మేకార్తి దినపత్రిక,మే -09 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" లో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు విద్యాశాఖ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు.సీఎస్ రామకృష్ణారావు 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక విద్యా వారోత్సవాలు, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, జనగణన సెల్ఫ్ ఎన్యుమరేషన్, ఫార్మర్ రిజిస్ట్రీ, తదితర అంశాలపై, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీ ఎస్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు ఏడు రోజుల పాటు ప్రణాళికకు అనుగుణంగా నిర్వహించాలన్నారు.ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియకు సంబంధించి, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే తరలింపు చేపట్టాలని



వివరించారు. తగినన్ని గన్ని సంచులు, లారీలు, తగినంతమంది హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ లో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, డీఐఈఓ శరత్, సీపీఓ శ్రీనివాస చారి, డీఏఓ అఫ్జల్ బేగం, డీటీఓ లక్ష్మణ్, డీసీఓ రామకృష్ణ, పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, సహాయ లేబర్ అధికారి నజీర్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు సిఎంగా ప్రమాణ స్వీకారం

**– తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం**
**– రాహుల్ గాంధీ, పలువురు ప్రముఖులు హాజరు**

మేకార్తి దినపత్రిక, మే 11 ప్రతినిధి

**ఉచిత విద్యుత్‌కు తొలి సంతకం**

చెన్నై : తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా తమిళ వ్రెటి కజగం (టివికె) అధినేత జోసెఫ్ విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. చెన్నైలోని జవహరల్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఆదివారం ఉదయం పది గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్.. విజయ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. విజయ్ ప్రమాణస్వీకారాన్ని మొదలు పెట్టగానే ఆయన అభిమానులు, టివికె కార్యకర్తలు, మద్దతుదారులు ఒక్కసారిగా కేరింతలు, చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విజయ్‌తో పాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, విజయ్ తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. టివికె కార్యకర్తలు, విజయ్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలి రావడంతో ఇండోర్ స్టేడియంలో పండుగ వాతావరణం కనిపించింది.

**ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం**

సిఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ మూడు ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేశారు. ఉచిత విద్యుత్ ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. ఈ మేరకు ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందనుంది. యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్, మహిళల రక్ష?ణకు 'సింగప్పున్' ర్యాపిడ్ రెస్పాన్స్ ఫోర్స్ ఫైళ్లపై కూడా విజయ్ సంతకాలు పెట్టారు. ఈ




సందర్భంగా విజయ్ ఎంతో భావోద్వేగంతో ప్రసంగించారు.

**గుర్తుంచుకోండి.. ఒక్క పైసా తినను**

విజయ్ తన ప్రసంగంలో పలు కీలక విషయాలను ప్రస్తావించారు. తమిళనాడులో ప్రజాప్రభుత్వం వచ్చిందని చెప్పారు. సామాజిక, లౌకిక, న్యాయశకం మొదలైందని తెలిపారు. డైరెక్టర్ కుమారుడు నేడు సిఎం అయ్యాడనీ, తాను ఎన్నో కష్టాలు అధిగమించి ఈ స్థాయికి వచ్చానని విజయ్ చెప్పారు. తనను ఎంతో మంది ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టారనీ, హామీల అమలుకు కొంత సమయం ఇవ్వాలని విజయ్ ఈ సందర్భంగా కోరారు. "గుర్తుంచుకోండి.. విజయ్ ఒక్క పైసా కూడా ప్రభుత్వ సొమ్ము తినడు. నాకు ఆ అవసరం లేదు. నేను తప్పు చేయను. నా చుట్టూ ఉన్నవారిని చేయనివ్వను" అని అన్నారు. విద్యార్థుల కోసం విజయ్ మామ అన్నీ మంచి పనులే చేస్తాడని ఆయన హామీ ఇచ్చారు. ఒక్కటే పవర్ సెంటర్ అని, అది విజయ్ అని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

**ప్రధాని సహా పలువురు శుభాకాంక్షలు**

తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టివికె అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ కు ప్రధాని నరేంద్రమోడీసహా పలువురు నేతలు అభినందనలు తెలిపారు. విజయ్ పరిపాలన అద్భుతంగా సాగాలని, కేంద్ర ప్రబుత్వం తరపున పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తామని ఎక్స్ లో పేర్కొన్నారు.

**సిపిఎం అభినందనలు**

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ బేబి ఆదివారం ఎక్స్ వేదికగా సిఎం విజయ్ కు అభినందనలు తెలిపారు. "తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు తిరు సి. జోసెఫ్ విజయ్ కు అభినందనలు. లౌకికవాదం, ప్రజా సంక్షేమం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం సూత్రాలను నిలబెడుతుందని, తమిళనాడు ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆశిస్తూ.. మీకు, మీ ప్రభుత్వానికి శుభాకాంక్షలు " అని పేర్కొన్నారు.ప్రారంభంలో 'తమిళ మాతృవందనం' సాంప్రదాయం కొనసాగుతుంది: మంత్రి ఆధవ్ అర్జున

తమిళనాడులో, 'తమిళ తాయ్ వాళ్తు'ను మూడవ గీతంగా ఆలపించడం టివికె నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వానికి ఆమోదయోగ్యం కాదని మంత్రి అధవ్ అర్జున్ పేర్కొన్నారు. ప్రారంభంలో తమిళ తాయ్ వాళ్తు పాడాలని గవర్నర్ కార్యాలయాన్ని కోరామని, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఒక కొత్త సర్క్యులర్ ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందని తమకు తెలియజేశారని తెలిపారు. అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో 'తమిళ తాయ్ వాళ్తు' (తమిళ మాతృ వందనం), చివరలో జాతీయ గీతం ఆలపించే సంప్రదాయాన్ని కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందని తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున ఆదివారం ఎక్స్ లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో... మొదట 'వందేమాతరం', ఆ తర్వాత జాతీయ గీతం, చివరగా 'తమిళ తాయ్ వాళ్తు' ఆలపించిన నేపథ్యంలో మంత్రి ఆధవ్ అర్జున ఈ ప్రకటన చేశారు.

**టీవీకే మంత్రులు :**

ఎన్. ఆనంద్ (టి. నగర్ నియోజకవర్గం)ఆధవ్ అర్జున (విల్లివాక్కం)కె.జి. అరుణ్‌రాజ్ (తిరుచెంగోడు)కె.ఎ. సెంగోట్టయన్ (గోబిచెట్టిప...

# పది వేల రూపాయలు మరియు నిత్య అవసర వస్తువులు అందజేత.



మేకార్తి దినపత్రిక మే 11సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

వేచరేణి గ్రామానికి చెందిన బిల్లం భూమయ్య (తండ్రి: రామయ్య) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఆసుపత్రి ఖర్చుల భారం మోయలేక, సరైన వైద్యం అందక కన్నుమూశారు.భూమయ్య మరణంతో ఆ కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడింది. ఆయనకు ఐదు సంవత్సరాల చిన్న పాప ఉంది. ప్రస్తుతం ఆ ఇంట్లో కనీసం పూట గడవడానికి బియ్యం గానీ, ఇతర వనరులు గానీ లేవు. తన భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆయన భార్య, అయిదేళ్ల పసిపాపను పట్టుకుని దిక్కుతోచని స్థితిలో హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ను సంప్రదించడం జరిగిందిఆ పాప భవిష్యత్తు ఆకలితో ఆ కుటుంబం అలమటించకూడదు. హెల్పింగ్ అండ్ స్వచ్ఛంద సంస్థ దాతల ద్వారా50 కేజీల బియ్యం రెండు నెలలకు సరిపడా కిరాణా సామాను మరియు పదివేల నగదు రూపాయలు అందించడం జరిగినది .ఈ కార్యక్రమంలో నీల శివకుమార్ గుప్తా, అయిత సంపత్ కుమార్ గుప్తా,
గందే వేణు గుప్త, తోట్టుపునూరి జగదీశ్వర్ గుప్తా, వేచరేణి గ్రామస్తులుయాసరేని లక్ష్మీపతి, దేవనబోయిన నర్సింలు, తాడురి మహేష్ , ఏనుగుల యాదగిరి, కల్లాటి రమేష్, దేవనబోయిన సతీష్, ఏనుగుల శ్రీకాంత్ , కల్లాటి రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో మొదటి రోజు.

మేకార్తి దినపత్రిక మే 11 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ మరియు పీజీ కళాశాలలో ఈరోజు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల మొదటిరోజు "ఎడ్యుకేషన్ వీక్ " కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్. శ్రీమతి. విజయలక్ష్మి గారి అధ్యక్షతన, పోస్టర్ ప్రజెంటేషన్ ను మరియు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ గంభీరావుపేట వెనిగర్ స్పాన్ గోబర్ సొల్యూషన్ డి డి యు. జి కే వై వారితో అవేర్నెస్ ప్రోగ్రామ్స్,,సెమినార్స్ వర్క్ షాప్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్,ఇండస్ట్రీ ఇంటరాక్షన్,ప్లేస్మెంట్ మరియు ఓరియెంటేషన్, స్కిల్ డెవలప్మెంట్ ఇవ్వడానికి జాబ్ మేళాలు నిర్వహించడం కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని ప్రిన్సిపాల్ గారు తెలియజేశారు.అదేవిధంగా కళాశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. ఎం.ప్రభాకర్, ఐ క్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్. వై.ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ పిఓ . ధర్మపురి, టి ఏ ఎస్ కె కోఆర్డినేటర్ డాక్టర్.జె.శ్రావణ్ కుమార్, స్కాలర్షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.ఆదివిష్ణు డబ్ల్యూ ఈ సి కోఆర్డినేటర్ వి.వాణి, డాక్టర్.కే. వి.బిక్షమయ్య,మనోహర్,శ్రీనివాస్,సూచరణ్, కృష్ణ ప్రసాద్, మహేష్, భార్గవి, దీపికా, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితర అధ్యాపకులు మరియు అధ్యాపకేతర బృందం విద్యార్థినీ పాల్గొనికార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా.

**– జిల్లా పరిధిలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు..**
**– సోషల్ మీడియా పై ప్రత్యేక నిఘా:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

మేకార్తి దినపత్రిక మే 11 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

జిల్లాలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పీ మహేష్ బి .గితే సోమవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు..ఈసందర్భంగా పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా వ్యాప్తంగా మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

జిల్లా పరిధిలో మూడు (తంగలపల్లి మండలం జిల్లెళ్ల , గంబిరావుపేట మండలం పెద్దమ్మ చౌరస్తా,రుద్రంగి మండలం మానాల క్రాస్ రోడ్ వద్ద) చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటుగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామన్నారు.

పశువులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇది మూగజీవాల పట్ల క్రూరత్వానికి దారితీస్తుందన్నారు.ప్రభుత్వం మరియు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుదని ఈసందర్భంగా ఎస్పీ గారు తెలిపారు.

**గోరక్షణ పేరుతో చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోవద్దు...**

గోరక్షణ పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ వారికి సమాచారం




అందించాలని,అక్రమంగా పశువులను తరలించే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు.

**సోషల్ మీడియా పై ప్రత్యేక నిఘా..**

సోషల్ మీడియా వేదికగా మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, నిజానిజాలు నిర్ధారించకుండా అసత్య ప్రచారాలు గ్రూప్ లలో ఫార్వర్డ్ చేసిన పోస్ట్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్ లపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

# మతసామరస్యాన్ని కాపాడేలా పండుగల నిర్వహణ చేపట్టాలి: డిఎస్పీ నాగేంద్రచారి.

మేకార్తి దినపత్రిక, మే 11 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



మతసామరస్యాన్ని కాపాడుతూ, ఇతరుల మనోభావాలకు కించపరచకుండా పండుగల నిర్వహణ చేపట్టాలని డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో హిందూ సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని,అపోహలు, వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు.పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్న పోలీసు శాఖకు తెలియజేయాలని తెలిపారు. సొంతంగా వాహనాలను ఆపడం తనిఖీలు చేయడం లాంటివి వద్దని తెలిపారు.సోషల్ మీడియా పోస్టులు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే డయల్ 100 ద్వారా లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.ఈకార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# రేటినా పెయింట్ షాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా.



మేకార్తి దినపత్రిక మే 11
సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ

చేర్యాల పట్టణ కేంద్రంలో నూతనంగా కొమ్ముల మల్లేశం నవీన్ లు ఏర్పాటు చేసిన రేటినా పెయింట్ షాప్ ను సోమవారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అ

# విద్యా వారోత్సవాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్..

మేకార్తి దినపత్రిక

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల తొలి రోజు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం పాల్వంచ మండలం భవానిపేట్ తాండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్ ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కేజీబీవీ విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభ, నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు



కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. విద్యార్థినులు నాణ్యమైన విద్యను అందిపుచ్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్య కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధికి దోహదపడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యా వారోత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలను జిల్లా కలెక్టర్ తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, పాల్వంచ తహసీల్దార్ జనార్ధన్, డీఎల్పీవో శ్రీనివాస్, ఎంఈఓ, ప్రిన్సిపల్ మహిషా, డీఈఓ సుకన్య, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి..

**-వరి కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలి**
**-సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్**

మేకార్తి దినపత్రిక

తేమ, తాలు, పొల్లు పేరుతో బస్తాకు నాలుగు కిలోల చొప్పున తరుగు కొట్టి రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సిపిఎం కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్



కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై 9 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికీ అనేక గ్రామాల్లో వరి కొనుగోలు ప్రారంభం కాలేదని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి గన్ని బ్యాగులు, లారీలు కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తేమ, తాలు, పొల్లు పేరుతో రైస్ మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తరుగు పేరుతో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోపే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

# ఫార్మర్ రిజిస్ట్రీలో 67.65 శాతం నమోదు పూర్తి..

**- జూన్ 2 నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

మేకార్తి దినపత్రిక

జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. రైతుల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 3,12,939 పీపీబీలు ( పి.పి.బి.ఎస్.) ఉండగా, ఇప్పటివరకు 2,11,691 మంది రైతుల నమోదులు పూర్తయ్యాయని తెలిపారు. దీంతో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం 67.65 శాతం పూర్తి అయినట్లు పేర్కొన్నారు. మిగిలిన రైతుల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి అర్హత కలిగిన రైతు వివరాలు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియ నిర్వహించాలని, అవసరమైన సహాయం అందించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కూడా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేసి జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలని తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుండా పనులు నిరంతరం కొనసాగించేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం, ఇతర




సదుపాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఇంటి పనుల పురోగతిని క్రమం తప్పకుండా పరిశీలించి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, జూన్ 2 నాటికి అన్ని ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# సప్లిమెంటరీ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం..

మేకార్తి దినపత్రిక

ఈ నెల మే 13 నుండి 21 వరకు నిర్వహించనున్న సప్లిమెంటరీ ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 31 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా




నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, వైద్య, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో విధులు నిర్వర్తించే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పరీక్షలు సజావుగా జరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ షేక్ సలాం, ప్రిన్సిపల్ ఎం.డి. యాకీనుద్దీన్, ఇర్ఫాన్ ఫాతిమా, చీఫ్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 111 దరఖాస్తులు..



మేకార్తి దినపత్రిక

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణ పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుండి మొత్తం 111 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, విద్యుత్ సమస్యలు, భూ వివాదాలు, మహిళా సమైక్య భవనం ఏర్పాటు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. రాజాంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన బంటు శ్యామయ్య తనకు రేకుల షెడ్డు మరియు బర్రెల కొట్టం నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు తమ మండలాలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో ఎన్.వి గిరి, సీఈఓ చందర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలూ.. సమ్మర్ జోష్‌కు సిద్ధమా..

మేకార్తి దినపత్రిక




వేసవి సెలవుల్లో విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెట్టేందుకు విద్యాశాఖ నడుం బిగించింది. ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల వ్యాప్తంగా పాఠశాలల్లో 'సమ్మర్ జోష్' పేరుతో విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రత్యేక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు కేవలం చదువే కాకుండా విభిన్న రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, కథా రచన, వక్తృత్వం, సంగీతం, నృత్యం, యోగా, క్రీడలు, సైన్స్ ప్రయోగాలు, పర్యావరణ అవగాహన వంటి అనేక అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. వేసవి సెలవులను సరదాగా, సృజనాత్మకంగా, ఉపయోగకరంగా మార్చే ఈ "సమ్మర్ జోష్" కార్యక్రమాలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రోత్సహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ, విద్యార్థుల మానసిక వికాసంతో పాటు సామాజిక అవగాహన, వ్యక్తిత్వ వికాసానికి ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

# ప్రభుత్వ కళాశాల స్థలాన్ని క్రీడా ప్రాంగణంగా మార్చిన నాయకులు

**- ప్రజా ప్రభుత్వం అంటే ఇదేనా అని ప్రశ్నిస్తున్న స్థానికులు**

మేకార్తి దినపత్రిక



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీ కేంద్రంలోని మూడవ వార్డులోని ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని చూయించి తెలంగాణ క్రీడా ప్రాంగణం అని బోర్డు కేటాయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ క్రీడా ప్రాంగణం అని బోర్డు కేటాయించి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తూ వాటిపై ప్రభుత్వం నుండి బిల్లులు సేకరించారు. ఇట్టి విషయంపై ప్రజా ప్రతినిధులు గత ప్రభుత్వానికైనా తెలివి ఉండాలి లేదా ప్రస్తుత ప్రభుత్వానికైనా ఇంగిత జ్ఞానం ఉండాలి అని అదేవిధంగా ప్రజాప్రభుత్వం అంటే ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టి తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డును తొలగించాలని స్థానికులు కోరారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com